# ఆరేండ్లలో వెయ్యి కోట్ల పెట్టుబడి

## హైదరాబాద్‌లో మరో యూనిట్ ▪ పెన్నార్ ఇండస్ట్రీస్ వైస్ ప్రెసిడెంట్ సునీల్

**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** రాష్ట్రానికి చెందిన ప్రముఖ ఇంజినీరింగ్, బిల్డింగ్ సేవల సంస్థ పెన్నార్ ఇండస్ట్రీస్ మళ్లీ పునర్‌వైభవాన్ని సంతరించుకుంటున్నది. ఇప్పటికే భారీ స్థాయిలో పెట్టుబడులు పెట్టిన సంస్థ వ్యాపారాన్ని శరవేగంగా విస్తరిస్తున్నది. వచ్చే ఆరేండ్లకాలంలో రూ. 800 కోట్ల నుంచి రూ.1,000 కోట్ల వరకు పెట్టుబడి పెట్టనున్నట్లు కంపెనీ వైస్ ప్రెసిడెంట్ కేఎం సునీల్ తెలిపారు. 2025 నాటికి బిలియన్ డాలర్ల కంపెనీగా తీర్చిదిద్దడానికి అహర్నిశలు కృషి చేస్తున్నట్లు దీంట్లోభాగంగా ప్రతియేటా రూ.100 కోట్ల వరకు ఇన్వెస్ట్ చేయనున్నట్లు ప్రకటించిన ఆయన..వీటితో ఐదు నూతన ప్లాంట్లను ఏర్పాటు చేయనున్నట్లు సంకేతాలిచ్చారు. వీటిలో ఒకటి హైదరాబాద్‌లో ఏర్పాటు చేయనుండగా, మరోకటి పుణె అని సూచనప్రాయంగా చెప్పారు. ఇప్పటికే హైదరాబాద్ చుట్టుపక్కల ఐదు యూనిట్లను నిర్వహిస్తుండగా, చెన్నైలో, మహారాష్ట్రలో మరోకటి ఏర్పాటు చేసింది. అలాగే రాయబరేలిలో రైల్వే కోచ్ కోసం ప్లాంట్‌ను ఏర్పాటు చేసినట్లు, ఇందుకు రూ.40 కోట్ల నిధులను వెచ్చించింది. వీటిద్వారా రైల్వే కోచ్, బిల్డింగ్‌లను వినూత్నంగా డిజైన్ చేస్తున్నది.



కంపెనీకి వచ్చిన మొత్తం ఆర్డర్లలో రైల్వే విభాగం నుంచి 30 శాతానికి పైగా సమకూరుతుండటం వల్లనే వ్యాపారంలో మళ్లీ నిలదిక్కుకోగలిగామని ఆయన చెప్పారు. ఇక నుంచి ప్రతియేటా 25 శాతానికి పైగా వృద్ధిని నమోదు చేసుకునేదానిపై ఆయన గట్టి నమ్మకాన్ని వ్యక్తంచేశారు. ఈ ఆరు ప్లాంట్లు 4.7 లక్షల మెట్రిక్‌టన్నుల సామర్థ్యం కలిగివున్నాయి.

### మార్చి నాటికి పూర్తికానున్న పెట్స్ విలీనం

పెన్నార్ ఇండస్ట్రీస్‌లో పెట్స్ పెన్నార్ విలీనం వచ్చే మార్చి నాటికి పూర్తికానున్నదని ఆయన పేర్కొన్నారు. ఈ విలీన ప్రతిపాదనకు ఇప్పటికే వాటాదారులు అనుమతించారని, నియంత్రణ మండళ్లు కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ప్రస్తుతం సంస్థలో ప్రమోటర్ల వాటా 36 శాతంగా ఉన్నది. గడిచిన ఆర్థిక సంవత్సరంలో రూ.600 కోట్లుగా నమోదైన పెట్స్ పెన్నార్ టర్నోవర్ ఈ ఏడాది రూ.700 కోట్లకు చేరుకునే అవకాశం ఉందన్నారు. అలాగే పెన్నార్ ఇండస్ట్రీస్ టర్నోవర్ రూ.1784 కోట్లుగా ఉంది. కాగా, పెన్నార్ గ్లోబల్ పేరుతో అంతర్జాతీయ మార్కెట్లో కూడా వ్యాపారాన్ని నిర్వహిస్తున్నది సంస్థ.




### రిటైల్ రంగంపై ప్రత్యేక దృష్టి

రిటైల్ రంగంపై కూడా ప్రత్యేక దృష్టి సారించింది పెన్నార్ ఇండస్ట్రీస్. ఇప్పటికే తెలుగు రాష్ర్టాల్లో 14కి పైగా అవుట్‌లెట్లను ఏర్పాటు చేసిన సంస్థ..వచ్చే రెండేండ్లలో 50కి పెంచుకోవాలని చూస్తున్నదన్నారు. ఒక్కో రిటైల్ అవుట్‌లెట్ నుంచి నెలకు కనీసంగా కోటి రూపాయల ఆదాయాన్ని అంచనావేస్తున్నట్లు చెప్పారు. వచ్చే రెండేండ్లకాలంలో రిటైల్ సెగ్మెంట్ నుంచి కనీసం రూ.100 కోట్ల ఆదాయం లక్ష్యంగా పెట్టుకున్నది సంస్థ. వీటితోపాటు ఏరోస్పేస్, రక్షణ రంగ పరికరాలపై కూడా దృష్టి సారించినట్లు ఆయన చెప్పారు.


నమస్తే తెలంగాణ Mon, 31 December 2018
https://epaper.ntnews.com/c/35335566